# బందీ

"ఓ పెగ్"

సుమిత్ర కోపంగా చూసింది శంకరం వైపు.

శంకర్ 'ఏం చేస్తాం' అన్నట్లు భుజాలెగరేశాడు.

"పోనీ జస్ట్ వన్ సిప్...."

అందమైన బుల్లి వైన్ గ్లాసులో బ్రౌనిష్ కలర్ వైన్ ఓసారి అలలా కదలి పూరుకొంది.

సుమిత్ర కాసేపు ఆలోచించి "సరే ఇవ్వు" అన్నది.

శంకర్ చప్పట్లు కొట్టి ఆనందం వ్యక్తం చేసి, ఆ బుల్లి గ్లాసు సుమిత్ర చేతికి అందించాడు.

తన చేత్తో పట్టుకొన్న గ్లాసు పైకెత్తి “ఛీర్స్” అన్నాడు.

“అలా అనాలా?” అన్నది చిరాగ్గా మొహం పెట్టి సుమిత్ర.

“అఫ్‌కోర్స్....మేమంతా.... అంటే మగాళ్ళం అలా అనుకొంటాం. పాపం నువ్వేం అంటావులే...”

సుమిత్ర చురుక్కుమంటూ అతనివైపు చూసింది. చేతిలో వున్న గ్లాసు లోంచి వైన్ ఒక్క గుక్కలో తాగేసింది. గొంతు మండిపోయి దగ్గొచ్చింది సుమిత్రకు. గ్లాసు కిందపెట్టేసి పక్కనే వున్న మంచినీళ్ళ సీసా అందుకొని గటగటా తాగేసింది.

శంకర్ చిరాగ్గా చూశాడు.

“ఏమిటా తొందర? అట్లా గుడ్లు మిటకరించి చూస్తూ గుటుక్కుమని తాగేస్తారా? అసలా డ్రింక్ ఏమనుకొంటున్నావు? ఐదొందల ఎకరాల ద్రాక్ష తోటలోంచి, ప్రశస్తమైన ద్రాక్షపళ్ళు సేకరించి చేసిన పాతికేళ్ళ నాటి వైన్ తల్లీ! కావాలంటే సీసా మీద రాసుంది చూడు” అంటూ సుమిత్ర మొహం ముందు సీసా ఆడించాడు శంకర్.

“ఛీ! అవతల పెట్టు” అంటూ సుమిత్ర గ్లాసు చేతిలోకి తీసుకుంది.

“అద్దీ... వెరీ గుడ్. ఇప్పుడెల్లా తాగాలంటే ఇలా పెదవులతో సిప్ చేయాలి. అది నాలుక మీద నుంచి అలా నోరంతా స్ప్రెడ్ అవుతూ గొంతులోకి జారాలి. అప్పుడూ థ్రిల్...”

సుమిత్ర నెమ్మదిగా ఒక్కో చుక్కా తాగడం మొదలుపెట్టింది.

“ఏమీ బాగా లేదు. కనీసం రుచిగా లేదు. తాగుతున్నప్పుడు హాయిగా ఏ కోకో కోలానో తాగుతున్నంత టేస్ట్ తగలడం లేదు. ఎందుకీ దిక్కుమాలిన తపన?”

శంకర్ కాళ్ళు తన్నిపెట్టి తీరిగ్గా కూర్చున్నాడు.

“ఇప్పుడిదంతా తాగేస్తే మత్తొస్తుందా?”

“హ్హా...హ్హా.... హ్హా.... నీ మొహం వస్తుంది. ఆ నాలుగు చుక్కలకే.... అలాటివి ఓ పది లాగించు.”

“అయ్య బాబోయ్! నా వల్ల కాదు. దరిద్రంగా వుందీ డ్రింక్!”

“ఎంతనుకున్నావమ్మా.... మూడువేలు.”

“మూడు చీరలొచ్చేవి!”

“ప్చ్... బాడ్ టేస్ట్.... అదే నేనయితే చొక్కాలు పూర్తిగా చిరిగిపోయినా, డ్రింక్ డబ్బుల్తో పది చొక్కాలు వచ్చేవి అనుకోను. ఆడంగులకు టేస్ట్ తెలియదు. పూర్ సోల్స్....”

"నీ బొంద సోల్స్"

సుమిత్ర సోఫాలో జారగిల పడింది.

'మత్తొచ్చేస్తే బావుణ్ణు... తూలుకుంటూ అలా మంచమ్మీద వాలిపోయే మత్తొచ్చేస్తే బావుండు' అనుకుంది.

"ఎందుకో దిగులుగా వుంది శంకర్...." అన్నది.

"ఎందుకూ! మీ ఆయన ఇంకా రాలేదనా?" అన్నాడు శంకర్ తనజోక్‌కి తనే నవ్వేస్తూ.

"ఇవ్వాళ లేట్‌గా వస్తానని ఇప్పటికి మూడుసార్లు ఫోన్లు చేశాడు. నాకు కంగారు లేకుండానట! ఇలా ఫోన్లు చేసి కంగారు పెట్టకు. నోరు మూసుకుని నీ ఇష్టం వచ్చినప్పుడు రమ్మని తిట్టేను."

"పతివ్రతా... అని నిన్ను పిలవటం చాలా కష్టం..." అన్నాడు శంకర్ ఆవలిస్తూ.

"సుమిత్ర బాలేదా.... పేరు మార్చేవూ.. కాసేపు నోరు మూసుకో. నాకు చిరాగ్గా కూడా వుంది."

"ఇందాక దిగులన్నావు. ఇప్పుడు చిరాకంటున్నావు. వాటీజ్ ది మేటర్?"

"ఎక్కడికైనా వెళ్ళాలని వుంది. ఎలా వెళ్ళటం? ఎక్కడికి పోవటం? నే వెళ్ళే చోటెక్కడ?"

శంకరం మళ్ళీ జారగిలబడ్డాడు.......................?

పేపర్లు ముందేసుకున్నా కళ్ళ ముందు అక్షరాల వరుసలు కదులుతున్నా బుర్రకి ఎక్కడం లేదు. రాత్రంతా నిద్ర లేక కళ్ళు మండుతున్నాయి. నాకునిద్రపట్టని రాత్రులెన్ని?

నీ సమక్షమే నా విశ్రాంతి మందిరం అంటాడు బాచీ డ్రమెటిక్‌గా చూస్తూ. ఇంట్లో వున్నంతసేపూ నా చుట్టూ తిరుగుతూ వుంటాడు. ఎటొచ్చీ అతని విశ్రాంతి ఘడియల్లోనే ఇదంతా. సాయంత్రం ఆరైపోతే క్లబ్బుకి పోకపోతే అతనికి గడవదు. ఉదయం లేస్తే ఫోన్ చేత్తో పుచ్చుకునే తినటం, తాగటం.. అన్నీ. చివరకు బాత్‌రూమ్‌కి కూడా ఫోన్ పట్టుకుపోతాడు. ఇంకా ఆదివారం ఫుల్‌గా అతని సొంత రోజే. అవ్వాళ పది గంటలయ్యేసరికి అతని దోస్తులతో ఇల్లు నిండుతూ, ఖాళీ అవుతూ వుంటుంది. లేదా అతనే వాళ్ళని వెతుక్కుంటూ వెళ్ళిపోతాడు. మూడ్ బాగా లేకపోతే వర్క్ ఓవర్‌లోడ్ అయితే ఫుల్‌బాటిల్ తీసుకునే రోజులు నెలలో రెండో, మూడో వుంటాయి. ఇంక

అతని సొంతం కానిదేదీ? అతని వెనకాల నీడలా, అతను ఇంట్లో లేనప్పుడు క్రికెట్ కాక ఇంకో ఛానెల్ చూడొచ్చు. చిన్న సౌండ్‌తో సంగీతం వినొచ్చు. అతను అడ్డదిడ్డంగా పడుకుంటే, వున్న చోట్లో సర్దుకోకుండా విశాలంగా చేతులు జాపి పడుకోవచ్చు. ఎన్నోసార్లు పోనీ ఇలా దుప్పటేసుకుని పడుకొంటా. హాయిగా వుంది అని కింద పడుకుంటే. 'ఎంత హాయిగా వుందో చూస్తా'నని అతనూ తయారు. తన స్నేహితులతో అతనే కబుర్లు ఎక్కువ చెప్తాడు. చివరకు శంకరం కూడా బాచీ బంధుకోటిలోకి చేరిపోయాడు. తనకి విశ్రాంతి అవసరమైనా లాభం లేదు. 'ఇప్పుడు తలనొప్పేమిటోయ్! హాయిగా టెర్రస్ మీదికి పదా, వెన్నెల్లో స్నానం చేద్దాం. తల్నొప్పి ఎగిరిపోతుంది' అంటూ అతను తనని రానంటున్నా మోసుకుపోగలడు. లేదా తనకి ఉత్సాహంగా వుంటే 'అబ్బ డల్‌గా వుంది. ఇలా దుప్పట్లో పడుకో!' అని తనను బంధించనూ వచ్చు. అతని విషాదంలో ఇల్లు నిశ్శబ్దమై పోతుంది. అతని సంతోషానికి ప్రతిధ్వనిస్తుంది.

చిన్నప్పుడు అమ్మ ఈ కొంపలో 'కాసేపు బయటికి పోయే దారి లేదు. ఉక్కిరిబిక్కిరిగా వుంది' అనుకొనేది. గుళ్ళూ, గోపురాలూ, ఉపవాసాలూ, పూజలూ అంటూ మనుష్యులకి దూరంగా పోయేది. ఎప్పుడూ 'నన్ను విసిగించకండి' అన్నమాట ఆమె నాలుక చివరే ఉండేది. అన్న పెళ్ళవగానే వాళ్ళ కోసం వేరే ఇల్లు చూసిందని అమ్మని ఎంతగానో విచిత్రంగా చూశారు. అన్న పిల్లవాడిని వారానికి ఓసారి పోయి చూసి వస్తోంది అంతే. నాలుగు రోజులు ఆవిడ దగ్గర వుంచుకోమన్నా, పోనీ ఇద్దరం బయటికి పోతున్నాం, పిల్లవాడిని క్రష్‌లో ఎందుకు? నువ్వు చూడమన్నా నాకు కుదరదనేసింది. తన పిల్లల్నీ అంతే. పురుడు పోసేందుకు తీసుకుపోయి ఆ నాలుగు నెలలూ ఎలాగోలా ప్రాణం బిగబట్టుకొన్నట్టు వున్నది.

'ఎందుకో అందరి మీదా ఇష్టం పోతుందే. విసుగ్గా వుంటోంది. దేని కోసం ఇన్నేళ్ళు బతికేనో, ఇంకెంతకాలం ఎందుకోసం బతుకుతానో అర్థం కావటం లేదు' అంది ఓ సారి. అర్థం కాలేదు అప్పుడు. అచ్చం అమ్మలాగే తనూ, అమ్మ చేయని ఉద్యోగం తన మెడకో డోలు.

"బాచీతో గొడవేదయినా వచ్చిందా?" అడుగుతున్నాడు గట్టిగా శంకర్ వినిపించుకోలేదని కాబోలు.

అతని వైపు చూసింది సుమిత్ర. 'ఎలా అర్థం అవుతుంది ఇతనికి?'

"శంకర్ నువ్వెందుకు పెళ్ళి చేసుకోలేదు మళ్ళీ!"

శంకర్ కళ్ళార్పకుండా కాసేపు సుమిత్ర వైపు చూశాడు.

"ఆమెకెందుకో నేను నచ్చలేదు. ఎంత స్నేహంగా వుండబోయినా దూరంగా వెళ్లిపోయింది. తను నీకు తెలుసుగా, భారతీ విద్యా నిలయం ప్రిన్సిపాల్... ఆమెకేం కావాలో నాకూ, నాకేం కావాలో ఆమెకూ, టోటల్‌గా మా ఇద్దరికీ మాకేం కావాలో, అవన్నీ ఎలా వస్తాయో తెలీలేదు. బస్! అంతే. కథ కంచికి.

చేతులు అటూ, ఇటూ తిప్పేసి – "ఫినిష్" అన్నాడు శంకర్.

"మనకేం కావాలి?" అన్నది సుమిత్ర.

శంకర్ చిన్నగా నవ్వాడు.

"చూడు సుమిత్రా... ఇక్కడ మనం అని కలపొద్దు. ఎవరికిగా వాళ్ళం. అలాగయితే మనకి ఏం కావాలి? బోలెడంత ప్రేమ, ఆప్యాయత, సేవ, సుఖం... అన్నీ కావాలి. మనం ఏం ఇవ్వకపోయినా మనకన్నీ కావాలి."

"జీవితం మొత్తం వీటితో సరిపోతుందా?"

శంకర్ ఆలోచించాడు. తల అడ్డంగా వూపేడు చెప్పలేనన్నట్టు.

"పోనీ నేను చెప్పనా?"

"చెప్పు" అన్నాడు శంకర్.

"మన బతుకు గమ్యం ఏమని నిర్ణయించుకుంటామో దాన్ని బట్టి వుంటుందనుకొంటా. నాలాటి వాళ్ళు పెళ్ళి, సంసారం, పిల్లలు, కాస్త తెరిపిగా జీవితం. మళ్ళీ పిల్లల పెంపకం, వాళ్ళ పెళ్ళిళ్ళు, బంధువులు... ఇదంతా చాలు అనుకొంటే బతుకు బతికేయగలం".

'నేనయితే చక్రం మధ్యలో ఇరుసులా ఇరుక్కుపోయాను. చక్రం తిరుగుతూ వుంటూ లోపలి ఇరుసూ చచ్చినట్టు తిరగాలి. నేను తిరగదలచుకోకపోయినా తిరుగుతుంటాను. అచ్చం ఆ ఇరుసు లాగే' అన్నది సుమిత్ర.

"పోనీ చెప్పు, నీ ఆశ ఏమిటి?"

"ఆలోచిస్తా!"

"సరే ఆలోచించి చెప్పు" అంటూ శంకర్ మళ్ళీ జారగిలబడ్డాడు.

❊ ❊ ❊

ఆలోచనలు మళ్ళీ వెనక్కే వెళుతున్నాయి. అన్నతో పంచుకున్న బాల్యం, అమ్మ ఒడిలో అన్నతో పాటు దొరికిన చోటూ.... ఎన్నెన్నో అభద్రతల మధ్య ఎన్నెన్నో జాగ్రత్తలతో సంవత్సరాలు గడిచిపోవటం.... అమ్మా, నాన్న తరువాత, అందరి ఇష్టాలు కూడా తనే పాటించవలసి రావటం. ఇదంతా ఎప్పటిదో పాత కథ. పోనీ బాచీతో

పెళ్ళి తరువాత... బాచీకి అనుగుణంగా మారటమే తను చేసింది. తన వ్యక్తిత్వం ఏమిటి? చదువుకొంది. చదువుతో ఉద్యోగం, పెళ్ళీ మిగతా సౌకర్యాలన్నీ, వీటన్నింటి మధ్య తన వ్యక్తిత్వం అంటూ వికసించేందుకు ఏముందీ! ఆ ఇంట్లోంచి, ఈ ఇంట్లోకి రావటం... అంతే. అమ్మలాగా తానూ ఇద్దర్ని కనటం, సెలవులు, క్రెష్‌లూ, పెంపకాలు, చాకిరీలు అంతే.... బస్!

గ్లాసందుకొంది సుమిత్ర మళ్ళీ.

❊ ❊ ❊

"బాచీతో నీకు గొడవేదయినా వచ్చిందని తేల్తోంది నాకు" అన్నాడు శంకర్.

"అలాంటిదేం లేదు. అతను గొడవలు పెట్టుకొంటాడా? చిన్నప్పటిలాగే వున్నాడు."

"శ్లేషనా!"

"ఇందులో శ్లేషలేం ధ్వనించాయో!"

"వాడికి మెదడు పెరగలేదని నీ భావం కాబోలు!"

"విపరీతార్థాలు తీయకు శంకర్. అతను మారవలసిన అవసరం ఏముందీ? జీవితం అతనికి కావలసినట్టు వుంది. అతనికి సదుపాయంగా, సౌకర్యంగా వుంది. ఇంకెందుకు మారాలి!"

"అదే జీవితం నీది కూడా. నువ్వెందుకు నిరాశగా వుందన్నావూ!"

"అతని బతుకులాగే నాదీ వుండలేదనేగా చెబుతూంట! అతని జీవితాన్ని నేనే అమర్చి పెట్టాలి. అందుకు అతను చేసుకొన్న ఏర్పాటు నన్ను కట్టుకోవటం. అంతే. జీవితం పగ్గాలు అతని చేతుల్లో, కళ్ళాలు నా నోట్లో. అతను ఆగమంటే ఆగుతూ, నడవమంటే నడుస్తూ...! నేను అలసిపోయాను. నాకు గుర్రం గుర్తుకొచ్చింది. నేను దానిలాగా అయిపోయినట్టు అనిపించి ఒళ్ళు జలదరించింది. అవును. నాకూ దానికీ తేడా ఏముందీ?" అన్నది సుమిత్ర.

"కారణం లేకుండా ఇదంతా నీ ఊహల్లోకి ఎలా వస్తోంది? అసలు నీ మనసులో వెలితి ఎందుకు వచ్చిందో నీకు క్లారిటీ వుండాలి కదా?" అంటున్నాడు శంకరం.

"ఉంటుంది. మనకు ఉండే సమయం ఎంతనీ! ఉద్యోగం, ఇంట్లో వ్యవహారాలు, తిండీ, నిద్రా పోను మిగిలిన అతి కొద్ది సమయం నేను ఉపయోగించు కోలేకపోతున్నా. నేనో స్నేహితుడిని ఎంచుకొన్నా, అతను బాచీ, మేమిద్దరం కలసి,

పిల్లల్తో ఇల్లు నిర్మించుకొన్నాం. మా ఇద్దరికే ఆ జీవితం పరిమితం. కానీ ప్రైవేటు జీవితం నాది. పబ్లిక్ జీవితం బాచీది. ఇది నాకు తృప్తినివ్వటం లేదు. ఇల్లు నా పూర్తి బాధ్యత అయింది. అతను 'షేర్ చేసుకో' అంటే చేసుకొంటాడు. నాకు మరీ తీరిక లేకపోతే, పిల్లలకు ఏదైనా అవసరం వస్తే, ఇంకంతే. సానుభూతితో నాకు సాయం చేస్తాడు. అది చాలదు. నా నెత్తిమీద నుంచి ఈ ఇల్లుని ఎవరైనా దించి కింది పెట్టాలి" గ్లాసు ముందు జాపింది సుమిత్ర.

"శంకరం నవ్వాడు.................." పర్వాలేదే.

"రెండ్రోజులు పనెగ్గొట్టి రెస్ట్ తీసుకో."

"ఎక్కడికి పోను?"

"మా ఇంటికి...." అని ఆగాడు శంకరం. "నేనొక్కడినే వుంటా. బ్రహ్మచారి కొంప. సాయంత్రం అయ్యేసరికి సీసాలు తెరుస్తాం."

సుమిత్ర నవ్వింది.

"ఇలాగే వున్నాయి ఇళ్ళన్నీ. ఇంకోళ్ళది ఇంకో సమస్య. పోనీ నేనయినా ఇంకో ఫ్రెండ్‌ని రెండ్రోజులు తీరిగ్గా వున్నా రమ్మని పిలిచే రోజుందా? నాకు ఏ రోజు కుదురుతుందో అది బాచీ చేతుల్లో వుంది. ఆ ఇంకోళ్ళ ఇల్లు, వాళ్ళ భర్తలు, బిడ్డలు, తండ్రుల చేతుల్లో వుంటుంది. మా కోసం మాకు ఇల్లంటూ వుండదు."

"ఇది మరీ బావుంది. మనిషి ఎక్కడో చోట వుండాలిగా. నాకు పెళ్ళాం, పిల్లలూ లేరు. అయినా నాకో ఇల్లు, వంటా వార్పు...నాకింకో సర్వెంటు... ఇవన్నీ లేవా? నువ్వు ఇవన్నీ కాదని ఏ స్వేచ్ఛ కావాలనుకొంటున్నావు? అసలు పెళ్ళి, పిల్లలు వద్దంటావా కొంపదీసి?"

"పెళ్ళిలో వున్న తిరకాసు వద్దంటున్నా. నా బతుకుని మాయ చేసిన ఈ సాలెగూడు వద్దంటున్నా."

"సింగిల్ ఉమన్‌గా వుండాలి మరయితే!"

శంకర్ మొహంలో ఆశ్చర్యం, కాస్త చిరాకు కూడా కనిపించాయి సుమిత్రకు.

"అలా అయినా ఒక తోడు కావాలనిపించదా?"

"మరి అదీ కాక... ఇదీ కాక...."

"నన్ను బతకనిచ్చే జీవితం కావాలి. నాతోపాటు ఈ జీవితం షేర్ చేసుకోగలిగే తోడు కావాలి. ఈ ఇల్లు నేనెంత కావాలనుకుంటున్నానో, ఈ ఇంటిలో నేనెంత బందీనయ్యానో, అతనూ అంతలా అవ్వాలి. అతనికి స్వేచ్ఛనీ, నాకు సంకెళ్ళనీ ఇచ్చిన

ఈ జీవితం నాకొద్దు. నా కళ్ళ ముందు... కళ్ళు కట్టేసిన జట్కా గుర్రం దాని ముందర, ఒక పచ్చని గడ్డి పన కట్టేసిన కర్ర. అది జట్కా తోలే వాడి చేతుల్లో. గుర్రానికి, కళ్ళకు అడ్డుగా కట్టిన గంతల్లోంచి పచ్చిక పచ్చదనం మటుకే కన్పిస్తుంది. దాన్ని అందుకోవాలనే ఆశలో నురగలు కక్కుతూ పరుగులు తీస్తున్న జట్కా గుర్రం. దాన్ని చేజిక్కించుకోవాలన్న ఆశతో జన సమూహం మధ్య లోంచి సిమెంటు రోడ్ల మీద పరుగెడుతూ గుర్రం. ఎదురుగా పసిరిక మొలిచినా గుర్రానికి అందే అవకాశం లేనట్టే నాకూ లేదు.

ఓ దారుణమైన నవ్వు నవ్వేడు శంకరం.

"ఎంత చిత్రమైన కబుర్లు చెపుతుందీమె గుర్రంట. కాడి భుజాన వున్న ఎద్దుట. ఒళ్ళు కదలకుండా, అస్తారపదంగా చూసుకొనే మొగుడు, రెండ్రోజులకోసారి నాలాటి ఆవారాగాళ్ళతో హోటళ్ళలో పార్టీలు, సినిమాలు, తిరుగుళ్ళు, జోరు జోరుగా జీవితం వుంటే....!

ఇంకా నవ్వుతూనే వున్నాడు. ఒక్కోమాట చెపుతూ... నవ్వుతూ....

సుమిత్రకు అర్థమైపోయింది. అతనికి అర్థం కాని, పోనీ అర్థం చేసుకొనేందుకు ఇష్టపడని విషయాన్ని అతని బుర్రలోకి ఎక్కించే ప్రయత్నం చేయటం ఎంత వృధా! బాచీకి కార్బన్ కాపీ గాళ్ళతో ఎందుకీ ఘోష వినిపించటం.... అనవసరం.

నెత్తిమీద టన్ను బరువుంది. దింపుకోలేని భారం. వీటన్నింటి మధ్య నా ఉనికి ఎక్కడన్నదే గదా ప్రశ్న? నేనేమిటో, ఎలాగున్నానో చూసుకోగలిగే అద్దం లేదు. పూర్తిగా నాకు నేనే అపరిచితురాలినై పోతూ... ఈ జీవితం నన్ను లాగేస్తోంది. ఒక ఊబి లాంటి బతుకు నన్ను క్రిందికి దించేస్తోంది. గిరగిర తిరిగే పళ్ళచక్రంలో పడిపోయినట్టు నేను చేసిన పనులే చేస్తూ, తెల్లవారుతూ, పొద్దుగూకుతూ.... గమ్యం తెలిపోయింది. నాకై నేను తయారు చేసుకున్న ఈ శిలువను మోస్తూ, మోస్తూ.....

ఈ బతుకులోంచి పారిపోతే, నే తల దాచుకొనే చోటెక్కడ? నే చేసే ఆర్తనాదం సరిగ్గా అర్థమయ్యేదెవరికి? ఇంకెప్పటికీ నేను నా నీడనే.... ఇంకంతే.... అనుకొన్నది సుమిత్ర. ఆమె కళ్ళముందు టకటకమని జట్కా గుర్రం పరుగెడుతోంది. ఎదురుగా కర్రకి వేలాడుతోన్న పచ్చగడ్డి కోసం, నురగలు కక్కుతూ... పరుగెడుతూ.... పరుగెడుతూ... ❊